సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
మంగళవారం । 2 । జూలై । 2024



అన్నదాన భవనానికి విరాళం


ఆత్రేయపురం: వాడపల్లి వేంకటేశ్వరస్వామి క్షేత్రంలో అన్నదాన భవనానికి గ్రంధి నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు (రాజమహేంద్రవరం) రూ.1,00,116 విరాళం అందజేశారు.



నిత్యాన్నదానానికి రూ.లక్ష

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి కొత్తపల్లి రామకృష్ణ, వరలక్ష్మి (రామచంద్రపురం) సోమవారం రూ.లక్ష విరాళం సమర్పించారు.

డెల్టాలకు 11,520 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు సోమవారం 11,520 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 3,500 మధ్య డెల్టాకు 2,020, పశ్చిమ డెల్టాకు 6,000 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజ్ వద్ద నీటిమట్టం 10.90 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

కర్తవ్యంతో అడుగులు



కొత్తూరులో ఫించన్ అందిస్తున్న మంత్రి సుభాష్

రామచంద్రపురం: ప్రజలు ఏ ఆశయం, ఆకాంక్షలతో ఓట్లు వేసి గెలిపించారో వాటిని నెరవేర్చే కర్తవ్యంతో ప్రభుత్వం అడుగులు వేస్తోందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. సోమవారం నియోజకవర్గంలోని రామచంద్రపురం పట్టణం కొత్తూరు, కె.గంగవరం మండలం పాణింగిపల్లి గ్రామాల్లో ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని ఇటీవల పెంచిన పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. పెంచిన పెన్షన్ రూ.4,000తో పాటు ఏప్రిల్ నుంచి జూన్ వరకు మూడు నెలల పాటు బకాయిగా ఉన్న రూ. 3,000 కూడా కలిపి మొత్తం రూ.7,000 ఒకేసారి పంపిణీ చేశామన్నారు. వికలాంగులకు రూ.6,000 వరకు పింఛన్ పెంచామన్నారు. గరికిపాటి సూర్యనారాయణ, పోలిశెట్టి చంద్రశేఖర్, మున్సిపల్ డీఈ వెంకటేశ్వరరావు మున్సిపల్, సచివాలయ, రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

పనిచేసే ప్రదేశంలో మహిళల భద్రతకు ప్రాధాన్యం

అమలాపురం రూరల్: పనిచేసే ప్రదేశంలో మహిళల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో మహిళా ఉద్యోగుల సమస్యలపై అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ పనిచేసే ప్రదేశంలో మహిళలు లైంగిక వేధింపులకు గురికాకుండా అరికట్టే దిశలో మహిళల రక్షణ కమిటీ ఏర్పాటు చేసి నివేదిక అందజేయాలని స్పష్టం చేశారు. పని చేసే ప్రదేశంలో మహిళలు, లైంగిక వేధింపుల ఫలితంగా భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 15 హెచ్ ప్రకారం లింగ సమానత్వం కోసం స్త్రీ ప్రాథమిక హక్కు, భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం గౌరవంగా జీవించే హక్కు, ఏదైనా వృత్తిని అభ్యసించే హక్కు లేదా లైంగిక వేధింపులకు గురికాకుండా మహిళలు సురక్షితమైన వాతావరణం పొందే హక్కును కలిగి ఉన్నారన్నారు. అందులో భాగంగా పనిచేసే ప్రదేశాల్లో అంతర్గత ఫిర్యాదుల కమిటీ కింద ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లా స్త్రీ శిశు సంక్షేమ అధికారి ఎం.ఝాన్సీ రాణి మాట్లాడుతూ పరిజ్ఞానం ఉన్న ఉద్యోగుల నుంచి ఇద్దరు సభ్యుల కంటే తక్కువ కాకుండా కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. ఈ మొత్తం ప్రక్రియను పర్యవేక్షణ చేసేందుకు మున్సిపల్ కమిషనర్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు నోడల్ అధికారిగా వ్యవహరించాల్సి ఉంటుందని తెలిపారు. జేసీ నుపూర్ అజయ్, డీఆర్వో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఐటీఐలలో రెండో విడత కౌన్సెలింగ్‌కు ఆహ్వానం

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో రెండో విడత ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ ఎంవీజీ వర్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తులకు ఈ నెల 24వ తేదీ సాయంత్రం 5 గంటల వరకూ గడువు ఉందన్నారు. మొదటి విడతలో ఐటీఐ సీట్లు రాని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 0884-2348182, 970 121 5511 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 27, 28, ప్రైవేట్ ఐటీఐలలో 29, 30 తేదీల్లో కౌన్సెలింగ్ ఉంటుందని పేర్కొన్నారు.

కొత్త క్రిమినల్ చట్టాలు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం

– విధులను బహిష్కరించిన న్యాయవాదులు

అమలాపురం టౌన్: కేంద్ర ప్రభుత్వం సోమవారం నుంచి అమల్లోకి తెచ్చిన కొత్త క్రిమినల్ చట్టాలు రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తున్నాయని అమలాపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వీరిన సాయి అన్నారు. కొత్త చట్టాలను నిరసిస్తూ స్థానిక న్యాయవాదులు సోమవారం విధులను బహిష్కరించారు. స్థానిక బార్ అసోసియేషన్ వద్ద జరిగిన ఈ నిరసన కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది ఎండీ ఆజామ్ మాట్లాడుతూ కొత్త చట్టాల కారణంగా పోలీసులకు అపరిమితమైన అధికారాలు సంక్రమించాయని తెలిపారు. ఈ చట్టాలు పౌర సమాజానికి తీవ్ర నష్టం కలిగిస్తాయని ఆజామ్ ఆందోళన వ్యక్తం చేశారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎస్. శ్రీనివాస్, సీనియర్ న్యాయవాదులు కళా వెంకట్రావు, ఎన్వీ సూర్యనారాయణ, బడుగు భాస్కర్ జోగేష్, కుడుపూడి అశోక్, చింతపల్లి అజయ్‌కుమార్, నందెపు చిన వెంకటేశ్వరరావు, బీర వెంకటరావు కొత్త చట్టాలను వ్యతిరేకిస్తూ ప్రసంగించారు.

ప్రజా సమస్యలకు పరిష్కారాలు



ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థలో అర్జీ పరిశీలిస్తున్న కలెక్టర్ శుక్లా

– అధికారులకు కలెక్టర్ హిమాన్షు శుక్లా సూచన

అమలాపురం రూరల్: ప్రజా సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి, క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా విచారించి తగిన పరిష్కార మార్గాలు చూపాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ గోదావరి భవన్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో 112 మంది అర్జీదారులు తమ సమస్యలను కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్ అజయ్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లుకు అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ గడువు దాటిన అర్జీలు లేకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ ఎం.ఝాన్సీరాణి, డీఈవో ఎం.కమల కుమారి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేష్‌బాబు, పంచాయతీ రాజ్ ఎస్సీ కె.చంటిబాబు సీపీవో వెంకటేశ్వర్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.దుర్గారావు దొర, జిల్లా వ్యవసాయ అధికారి ఎ.బోసుబాబు, జిల్లా వైద్యశాల సమన్వయ అధికారి డాక్టర్ కార్తీక్‌రెడ్డి, కోనేరు రంగారావు కమిటీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వి. మదన్మోహనరావు, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ పీకే పీ ప్రసాద్ జిల్లా పౌరసరఫరాల అధికారి ఏ పాపారావు పాల్గొన్నారు

ఎస్పీ కార్యాలయానికి 8 అర్జీలు

అమలాపురం టౌన్: స్థానిక జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమానికి 8 అర్జీలు వచ్చాయి. జిల్లా ఎస్పీ సునరాపు శ్రీధర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురి



ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో ఓ కుటుంబం ఇచ్చిన అర్జీని పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ శ్రీధర్

ఫిర్యాదుదారులు వచ్చి తమ సమస్యలను ఏకరవు పెట్టుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థకు వచ్చిన అర్జీలను ప్రాధాన్యత క్రమంలో త్వరితగతిన పరిష్కరించాలని ఎస్పీ శ్రీధర్ జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలను ఆదేశించారు. ఎస్పీ తన వద్దకు వచ్చిన 8 అర్జీల్లో కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించారు.

మా భూమిని కబ్జా చేశారు



ఉప్పలగుప్తం మండలం ఎస్. యానాం గ్రామంలో నా తండ్రి మామిడికుదురు త్రిమూర్తులుకు చెందిన ఎకరం రెండు సెంట్ల భూమిని గ్రామంలో ఒక భూస్వామి కబ్జా చేశారు. దీనిపై గతంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా ఆర్డీవో, రెవిన్యూ అధికారులు విచారణకు పిలిచి న్యాయం చేయలేదు. భూమి సమస్యపై మాకు న్యాయం చేయాలని కలెక్టర్‌కు మళ్లీ ఫిర్యాదు చేశాం.

– కేశనకుర్తి కనకదుర్గ, బాధితురాలు

కూటమి నేతల పటాటోపం

- సామాజిక పింఛన్ల పంపిణీలో ప్రచారానికి ప్రాధాన్యం
- గత ప్రభుత్వంలో అందరికీ ఇంటి వద్దే ప్రశాంతంగా అందజేత
- ఇప్పుడు కొన్నిచోట్ల ఇళ్ల వద్ద కాకుండా ఓ చోటకు పిలిచి పంపిణీ
- ఇదేం హంగామా అంటూ లబ్ధిదారుల్లో గందరగోళం, ఆవేదన



సఖినేటిపల్లి మండలం అప్పనరామునిలంక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్దకు లబ్ధిదారులను పిలిచి పింఛన్లు అందజేస్తున్న కూటమి నాయకులు

అమలాపురం టౌన్: గత ప్రభుత్వంలో ఏ రణగొణ ధ్వనులు, ప్రచార ఆర్భాటాలు లేకుండా సామాజిక పింఛన్ లబ్ధిదారులు ఒకటో తేదీన తెలతెల వారుతుండగానే ప్రశాంత వాతావరణంలో పింఛన్ సొమ్ము అందుకునేవారు. ఇప్పుడు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక పెంచిన పింఛన్లను అటు టీడీపీ నాయకులు, ఇటు జనసేన, బీజేపీ నాయకులు పోటీపడి మరీ ప్రచార ఆర్భాటంతో పంపిణీ చేయడంతో జిల్లాలోని చాలాచోట్ల లబ్ధిదారులు ఒకింత గందరగోళానికి గురయ్యారు. పింఛన్‌దారులను కొద్దిసేపు నిలబెట్టి ఆయా పార్టీల ఎమ్మెల్యేలు, నాయకులు ఫొటోలు తీసుకోవడానికే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు. ఇంటికి వెళ్లి లబ్ధిదారులకు పింఛను అందించవలసి ఉండగా కొన్ని గ్రామాల్లో పింఛన్లదారులు కొంతమందిని ఓ చోటకు పిలిచి పింఛన్లు ఇవ్వడం కనిపించింది. రాజోలు నియోజకవర్గం సఖినేటిపల్లి మండలం అప్పనరాముని లంక, అమలాపురం నియోజకవర్గం అల్లవరం మండలం దేవగుప్తం, పి.గన్నవరం మండలం కందాళపాలెం, కాజులూరు మండలం కోలంక తదితర గ్రామాల్లో పార్టీల నాయకులు లబ్ధిదారులను ఓ చోటకు పిలిచి పింఛన్లు అందజేశారు. అల్లవరం మండలం దేవగుప్తం తదితర గ్రామాల్లో టీడీపీ నాయకుల ఇళ్ల వద్ద పింఛన్ల కార్యక్రమం ప్రారంభం పేరుతో పది లేదా 15 మంది లబ్ధిదారులను పిలిచి పింఛన్లు ఇచ్చారు. పి.గన్నవరం హైస్కూలు వద్ద ఓ ప్రారంభోత్సవం కార్యక్రమం వద్ద ఎమ్మెల్యే కొందరి పింఛన్‌దారులకు అందజేశారు. రాజోలు మండలంలో పింఛన్ల కార్యక్రమం ప్రారంభంలో భాగంగా ఓ చోట సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ చిత్ర పటాలకు క్షీరాభిషేకాలు చేస్తూ అక్కడకు కొంతమంది లబ్ధిదారులను పిలిచి పింఛన్లు ఇచ్చారు.

నేతల అట్టహాసం

పింఛన్లు ఇచ్చేది గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులైనప్పటికీ తొలిరోజు వారి పాత్ర లబ్ధిదారులతో వేలిముద్ర వేయించుకోవడం వరకే పరిమితమైంది. ఆయా పార్టీల నాయకులు హడావుడి, ఆర్భాటమే ఎక్కువగా కనిపించింది. టీడీపీ, జనసేన ఎమ్మెల్యేలు, నాయకులు, బీజేపీ నాయకులు పింఛన్ల పంపిణీలో విధిగా పాల్గొనాలని ఆయా పార్టీల అగ్రనేతలు పిలుపు ఇవ్వడంతో రెట్టించిన ఉత్సాహంతో నాయకులు పాల్గొన్నారు. వీధి వీధినా పింఛన్ల పంపిణీ కార్యక్రమాలను మూడు పార్టీల నాయకులు అట్టహాసంగా నిర్వహించారు. పింఛన్ల పంపిణీలో కూటమి ప్రభుత్వం గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అనుసరించిన విధానాన్నే దాదాపు అమలు చేసినప్పటికీ వలంటీర్లతో కాకుండా సచివాలయ ఉద్యోగులతో ఇలా నాయకులు ఆర్భాటం మధ్య పంపిణీ చేయడంపై కొందరు లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేయడం కనిపించింది. పెంచిన పింఛన్ల పంపిణీ చేపట్టిన మొదటి నెల కాబట్టి మూడు పార్టీల నేతల హడావుడి ఉందా? లేక ప్రతి నెలా ఇలా ఉంటుందా? అనే సందేహం కూడా లబ్ధిదారుల్లో వ్యక్తమైంది.

దివ్యాంగులకు నిరాశే

సామాజిక పింఛన్లను రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెంచారు. గడచిన ఏప్రిల్, మే, జూన్ నెలలకు పెంచిన మేర నెలకు రూ.వెయ్యి వంతున రూ.3 వేలు కలిపి మొత్తం రూ.7 వేలు అందించారు. ఇదే సమయంలో దివ్యాంగుల పింఛన్‌ను రూ.3 వేల నుంచి రూ.6 వేలకు పెంచారు. అయితే తమకు కూడా పెరిగిన రూ.3 వేలను మూడు నెలలకు గానురూ.9 వేలతో పాటు పెంచిన రూ.6 వేలు కలిపి మొత్తం రూ.15 వేలు వస్తుందని దివ్యాంగులు ఎదురు చూశారు. అయితే వారి చేతిలో రూ. 6 వేలు మాత్రమే పెట్టడంతో మాకు మూడు నెలలకు కలిపి డబ్బులు ఇవ్వలేదన్న నిరాశ వారిలో కనిపించింది.

95.92 శాతం పింఛన్ల పంపిణీ

జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ సోమవారం రాత్రి 8.30 గంటలకు 95.92 శాతం మేర పూర్తయినట్టు కలెక్టర్ కార్యాలయం విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపింది. జిల్లాలో మొత్తం 2,34,534 పెన్షన్లు ఉండగా 2,33,663 మందికి పంపిణీ జరిగింది. మొత్తం రూ.160,89,88,000 విడుదల కాగా రూ.154,33,68,000 మేర పింఛన్లకు పంపిణీ చేశారు.

యథాతథంగా జీఎన్ఎం విధులు



DME - Intensified GNM Course - Certain instructions in respect of relieving of the Intensified Trainees - Reg

Date: Monday, July 1, 2024 at 10:44 AM GMT+5:30

Sir/Madam,

Hence, the Principals of the Intensified GNM Institutions are informed not to relieve the Intensified Trainees.

Regards,
O/o Director of Medical Education,
A.P. Amaravathi, Vijayawada.

జీఎన్ఎంల బదిలీ ఉత్తర్వులను నిలుపు చేస్తూ వెలువరించిన జీఓ

సాక్షి ఇంపాక్ట్

ఆలమూరు: కాకినాడ, రాజమహేంద్రవరం సామాన్య ప్రభుత్వ ఆస్పత్రుల్లో విధులు నిర్వహిస్తున్న శిక్షణ పొందిన జీఎన్ఎంలను పూర్వపు విధుల్లోకి పంపించకుండా యథాతథ స్థితిని కొనసాగించాలంటూ రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. 'సాక్షి' దినపత్రికలో సోమవారం 'వైద్యారోగ్యంలో ఇదేం చోద్యం' అనే శీర్షికతో కథనం ప్రచురితమైన సంగతి పాఠకులకు విదితమే. అందులో భాగంగా స్పందించిన కాకినాడ డీఎంహెచ్‌ఓ కార్యాలయం ఈ మేరకు సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలుస్తోంది. దీనిపై కాకినాడ డీఎంహెచ్‌ఓ జె.నరసింహనాయక్‌ను వివరణ కోరగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ప్రధాన ఆస్పత్రుల్లో పనిచేస్తున్న జీఎన్ఎంలను తదుపరి ఉత్తర్వులు వెలువరించే వరకూ ప్రస్తుతం పనిచేసిన చోటే ఉండాలని ఆదేశాలు అందాయన్నారు. ఆ మేరకు జీఎన్ఎంలుగా శిక్షణ పొందిన ఏఎన్ఎంలకు యథాతథ స్థితిని కొనసాగించనున్నామన్నారు.



జె.నరసింహనాయక్

రథానికీ ఓ గూడు

- సత్యదేవుని చిన్న రథానికి షెడ్డు
- పశ్చిమ రాజగోపురం వద్ద రూ.1.49 లక్షలతో నిర్మాణం

అన్నవరం: రత్నగిరి వాసుడు సత్యదేవుని చిన్న రథానికి ఎట్టకేలకు రక్షణ ఏర్పడింది. ఎండకు ఎండి, వానకు తడిసి పాడైపోకూడదనే ఉద్దేశంతో ఈ రథానికి పశ్చిమ రాజగోపురం వద్ద షెడ్డు నిర్మించారు. మధ్యలో ఎత్తుగా ఉండి నాలుగు వైపులా పల్లంగా ఉండేలా రూ.1.49 లక్షలతో టెన్సైల్ రూఫ్ షెడ్డు నిర్మించారు. ఈ షెడ్డులో సోమవారం రథాన్ని ఉంచారు. రత్నగిరిపై సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారిని ఊరేగించేందుకు సుమారు రూ.34 లక్షల వ్యయంతో టేకుతో చిన్న రథం తయారు చేయించిన విషయం తెలిసిందే. ఈ ఏడాది ఫిబ్రవరి 16వ తేదీన తొలిసారిగా ఈ రథంపై స్వామి, అమ్మవార్లను ఊరేగించారు. ఆ తరువాత ప్రతి ఆదివారం ఉదయం 10 గంటలకు ఆలయ ప్రాకారంలో స్వామి, అమ్మవార్లకు ఈ రథంపై ప్రాకార సేవ నిర్వహిస్తున్నారు. ఈ ఊరేగింపు అనంతరం ఈ రథాన్ని ఆలయ ప్రాకారంలో సన్‌డయల్ వద్ద నిలిపి, దానిపై కవర్ కప్పుతున్నారు. అయితే ఈ రథానికి రక్షణ కల్పించేందుకు షెడ్డు నిర్మించాలనే డిమాండ్ భక్తుల నుంచి రావడంతో ఈఓ కె.రామచంద్ర మోహన్ వెంటనే స్పందించారు. షెడ్డు నిర్మాణానికి ఆదేశాలిచ్చారు. ఈ మేరకు మూడు నెలల వ్యవధిలోనే ఈ షెడ్డును నిర్మించి అందులో రథాన్ని ఉంచారు.



షెడ్డులో ఉంచిన సత్యదేవుని చిన్న టేకు రథం

త్వరలో అన్‌బ్రేకబుల్ గ్లాస్ ఏర్పాటు

దేవస్థానం ఈఓ రామచంద్ర మోహన్ ఆదేశాల మేరకు చిన్న రథానికి పశ్చిమ రాజగోపురం వద్ద షెడ్డు నిర్మించాం. ఇందులోని రథాన్ని భక్తులు తిలకించేందుకు వీలుగా షెడ్డు చుట్టూ అన్‌బ్రేకబుల్ గ్లాస్ ఏర్పాటు చేస్తున్నాం. ఈ గ్లాస్ ఏర్పాటుకు రూ.లక్షన్నర వరకూ ఖర్చవుతుందని అంచనా వేశాం. ఇప్పటికే ఈఓ కార్యాలయం ముందు స్వామివారి ఊరేగింపు వాహనాలను భక్తులు తిలకించేలా షెడ్డు ఏర్పాటు చేసి, అద్దాలు అమర్చాం.

– రాంబాబు, డీఈఈ, అన్నవరం దేవస్థానం

రథసేవలో పాల్గొనండి

ఆలయ ప్రాంగణంలో చిన్న రథంపై ప్రతి ఆదివారం నిర్వహించే సత్యదేవుని రథసేవలో భక్తులు పాల్గొనేందుకు అధికారులు రూ.2,500 టికెట్టు నిర్ణయించారు. ఈ సేవలో భక్తులు పాల్గొనాలని వారు కోరుతున్నారు. ఒక టికెట్టుపై దంపతులు, ఇద్దరు పిల్లలను అనుమతిస్తారు. వీరికి స్వామివారి శేషవస్త్రం, అంతరాలయ దర్శనం, వేద పండితుల ఆశీర్వచనం, స్వామివారి ప్రసాదం అందజేస్తారు.

అమ్మో.. మొభయల్!

- పెరిగే బిల్లు.. జేబుకు చిల్లు
- టారిఫ్‌లు భారీగా పెంచేసిన సర్వీస్ ప్రొవైడర్లు
- కనెక్షన్‌పై నెలకు రూ.50 అదనపు భారం
- ఉమ్మడి జిల్లాలో 27లక్షలకు పైగా మొబైల్స్ వినియోగం

ఆలమూరు: మొబైల్ ఫోన్ ఉంటే ప్రపంచం అరచేతిలో ఉన్నట్టే! ఆపదలో కాని సంతోషంలో కాని మరేదైనా సంఘటనను ఎదుర్కొన వలసి వచ్చినప్పుడు వెన్నంటి ఉండి ఉపశమనం కలిగించేది స్మార్ట్ ఫోన్ మాత్రమే అనే భావన ప్రజల్లో విస్తృతంగా ఏర్పడింది. ఏడాది వయస్సు కలిగిన చిన్నారి నుంచి వందేళ్ల వృద్ధుల వరకూ సగటు జీవితంలో సెల్‌ఫోన్ భాగమై పోయింది. ల్యాండ్ ఫోన్‌ను వినియోగించే సమయంలో ఇంట్లోని కుటుంబ సభ్యులందరూ ఒక్కచోటకు చేరి కాల్స్ మాట్లాడుకునే వారు. కాని మొబైల్స్ అందుబాటులోకి వచ్చాక ఎవరికి వారికే సెల్‌ఫోన్లు వాడుతున్నారు. దీంతో రోజు రోజుకు మొబైల్స్‌ను వినియోగించే వారి సంఖ్య పెరుగుతోంది. వినియోగదారుల బలహీనతలను సర్వీస్ ప్రొవైడర్లు అవకాశంగా తీసుకుని భారీగా టారిఫ్‌లను పెంచుతున్నారనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

వినియోగదారుల్లో ఆందోళన

దైనందిన జీవితంలో ప్రతి ఒక్కరూ మొబైల్ ఫోన్లను విపరీతంగా వాడడంతో టారిఫ్‌లకు ఒక్కసారిగా రెక్కలొచ్చాయి. దేశంలో 2021 ఏప్రిల్ తరువాత సర్వీస్ ప్రొవైడర్లు భారీగా టారిఫ్‌లు పెంచేయడంతో వినియోగదారుల్లో తీవ్ర అసంతృప్తిని నెలకొనడంతో పాటు ఆందోళన వ్యక్తమవుతోంది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో టెలికం రెగ్యులేటరీ ఆథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) గణాంకాల ప్రకారం జిల్లాలో సిమ్‌కార్డుల సంఖ్యను బట్టి సుమారు 27 లక్షల వినియోగదారులు ఉన్నారు. అందులో చాలామంది రెండు సిమ్‌కార్డులు వినియోగిస్తుండగా ఎక్కువ భాగం ఆండ్రాయిడ్ ఫోన్లనే వినియోగిస్తున్నారు. పెరిగిన ధరల వల్ల వేతన జీవులు, దినసరి కూలీలు, కార్మికులకు అదనపు భారం పడి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఉంది. ఆండ్రాయిడ్, కీ పాడ్, ఫీచర్ ఫోన్లు ఉపయోగించే వారు పెరిగిన టారిఫ్‌లు భరించవలసిన పరిస్థితి ఏర్పడింది.

వినియోగదారులపై రూ.కోట్లలో భారం

సర్వీస్ ప్రొవైడర్లు తమ పోస్ట్ పెయిడ్ వినియోదారులకు నెలవారీ బిల్లులు, ప్రీ పెయిడ్ వినియోగదారులకు నెలవారీ టారిఫ్‌లను భారీగా పెంచేయడంతో వారందరిపై రూ.కోట్లలో భారం పడుతుంది. ప్రీ పెయిడ్‌లో పెరిగిన మొబైల్ టారిఫ్‌ల వల్ల కనెక్షన్‌కు ఏడాదికి రూ.65 నుంచి రూ.600 వరకూ అదనపు భారం పడుతుంది. సరాసరి నెలకు సగటున నెలకు రూ.50 వరకూ అదనంగా చెల్లించవలసి ఉంటుంది. దీంతో ఉమ్మడి జిల్లాలో నున్న మొబైల్ ఫోన్లకు ప్రస్తుతం నెలకు దాదాపు రూ.525 కోట్లు చెల్లిస్తుండగా పెరిగిన ధరల వల్ల మరో రూ.55 కోట్ల మేర వినియోగదారులకు అదనపు భారం పడనుంది. మొబైల్‌లో డేటా వినియోగం పెరిగితే ఆ ధరల భారం మరింతగా పెరుగుతుంది.

స్మార్ట్‌ఫోన్ల వాడకం మితిమీరితే అనర్థాలే

రోజు రోజుకు సాంకేతిక పరిజ్ఞానం కొంతపుంతలు తొక్కుతోంది. అందులో ప్రధాన భాగమైన మొబైల్స్‌ను మితి మీరి వాడితే ప్రయోజనాల కంటే దుష్పరిణామాలే ఎక్కువగా ఉంటున్నాయని సామాజిక వేత్తల పరిశీలనలో వెల్లడైంది. కాలంకర్పూరంలా హరించుకుపోతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. జిల్లాలో లక్షలాది మంది యువత రోజుకు మూడు నుంచి ఐదు గంటల పాటు మొబైల్ ద్వారా సామాజిక మాధ్యమాల్లో గడుపుతున్నారు. దీనివల్ల చదువుకున్న యువత పోటీ పరీక్షలకు సైతం వెనుకబడి పోతున్నారు. మరి కొందరైతే వీడియో గేమ్‌కు అలవాటు పడి జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారు. అనేక మంది మానసిక వ్యాధులు, నరాల జబ్బులకు గురవుతున్నారు. ఇష్టానుసారం సెల్‌ఫోన్లు వాడితే ఆరోగ్యపరంగాను, ఆర్థికంగాను తీవ్రంగా నష్టపోతారని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మొబైల్ ఫోన్ల వల్లే ఎంత ప్రయోజనం ఉంటుంతో అంతే ప్రమాదం కూడా ఉంటుందనే విషయాన్ని అందరూ గ్రహించవలసి ఉంది.



మొబైల్ ఫోన్లు

సర్వీస్ ప్రొవైడర్లు ప్రకటించిన ధరలు

ప్రస్తుతం (రూపాయల్లో)	సామర్థ్యం (జీబీ)	పెరిగినది (రూపాయల్లో)
నెల టారిఫ్		
155	నెలకు 2 జీబీ	189
299	రోజుకు 2 జీబీ	349
399	రోజుకు 3 జీబీ	449
రెండు నెలల టారిఫ్		
479	రోజుకు 1.5 జీబీ	579
533	రోజుకు 2 జీబీ	629
మూడు నెలల టారిఫ్		
666	రోజుకు 1.5 జీబీ	799
719	రోజుకు 2 జీబీ	859
ఏడాది టారిఫ్		
1,559	24 జీబీ	1,899
2,999	రోజుకు 2.5 జీబీ	3,599

సర్వీస్ ప్రొవైడర్లు అందరూ ఒకే దారిలో..

దేశంలో మొబైల్ సేవలను అందిస్తున్న సంస్థల ధరలు ఇంచుమించుగా ఇదే విధంగా ఉన్నాయి. అయితే ప్రభుత్వ రంగ సంస్థ అయిన బీఎస్ఎన్ఎల్ మాత్రం ఇంకా ధరల పెంచకపోవడం కొంత మేర ఊరట నిస్తుంది. అయితే బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ పలుచోట్ల వేగంగా లేకపోవడంతో వినియోగదారులను ఆకర్షించడం లేదు. ప్రొవైడర్లు భారీగా టారిఫ్‌లు పెంచిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం బీఎస్ఎన్ఎల్‌ను మరింత పటిష్టం చేసి అన్నిచోట్ల 4జీ సేవలను అందిస్తే వినియోగదారులకు మరింత ప్రయోజనకరంగా ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

క్లుప్తంగా

పురుగు మందు తాగి వ్యక్తి మృతి

ముమ్మిడివరం: కుటుంబ కలహాల నేపథ్యంలో ఒక వ్యక్తి పురుగు మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధి నక్కావారిపేటలో కుంచే చిరంజీవి(34)కి కొంతకాలం క్రితం పుష్పతో వివాహం జరిగింది. ఇటీవల అతని భార్య పుష్ప కువైట్‌కు వెళ్లింది. అక్కడ నుంచి పంపిన సొమ్మును విచ్చల విడిగా ఖర్చు చేస్తున్న చిరంజీవికి ఆమెకు మాటా మాటా పెరిగింది. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి పురుగు మందు తాగాడు. దీంతో అతన్ని స్థానికులు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. వారికి ఒక పాప, బాబు ఉన్నారు. ఈ మేరకు ముమ్మిడివరం ఏఎస్సై జాన్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అదుపుతప్పి లోయలో పడిన కారు

ఒకరి మృతి, ముగ్గురికి గాయాలు

రాయగడ: జిల్లాలోని అంబొదల పోలీసుస్టేషన్ పరిధి బంధుగుడ గ్రామ సమీపంలో అదుపు తప్పి కల్వర్టుని ఢీకొని లోయలో కారు పడిపోయిన దుర్ఘటనలో ఒకరు మృతి చెందగా మరో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. సోమవారం ఉదయం చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి మృతుడు దులుం మణికంఠగా గుర్తించగా, గాయాలైనవారిలో బోని శైలేష్, నందరాజు, ఎ.శ్రీనివాస్ ఉన్నారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడకు చెందిన దులుం మణికంఠ, బోని శైలేష్, నందరాజు, ఎ.శ్రీనివాస్, చేలూరి సంజీవ్ కుమార్‌లు ఒక కారులో ఒడిశాలోని బరాఘడ్‌కు విందు భోజనానికి వెళ్లి తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో జిల్లాలోని అంబొదలకు సమీపంలో బంధుగుడ వద్ద ఎదురుగా వస్తున్న ఒక లారీని తప్పించబోయి అదుపుతప్పి పక్కనే ఉన్న కల్వర్టును ఢీకొని సుమారు 20 అడుగుల లోయలోకి కారు పడిపోయింది. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జవ్వగా దులుం మణికంఠ అక్కడిక్కడే మృతి చెందాడు. కారులో ప్రయాణిస్తున్న శైలేష్, నందరాజు, శ్రీనివాస్‌లు తీవ్రగాయాలకు గురయ్యారు. అదే కారులో ప్రయాణించిన చేలూరి సంజీవ్ కుమార్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. సమాచారం తెలుసుకున్న అంబొదల పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను చికిత్స కోసం అంబులెన్స్‌లో అంబొదల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. కారులో ఇరుక్కుపోయిన మణికంఠ మృతదేహాన్ని రెండు గంటల పాటు శ్రమించి అగ్నిమాపక సిబ్బంది బయటకు తీశారు. అతివేగమే ప్రమాదానికి కారణమని పోలీసులు భావిస్తున్నారు.

పాత చట్టాలకు కొత్త చట్రం

- అమల్లోకి కొత్త క్రిమినల్ యాక్ట్
- కేసుల సత్వర పరిష్కారానికి ఆస్కారం
- ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా త్వరితగతిన శిక్షలు
- బాధితులకు భద్రత, భరోసా కలిగే అవకాశం

రాయవరం: బ్రిటిష్ కాలం నుంచి అంటే సుమారు 160 సంవత్సరాలుగా అమలులో ఉన్న పాత చట్టాలు ప్రస్తుత సమాజ పరిస్థితులకు అనుగుణంగా లేవని డాక్టర్ రణబీర్‌సింగ్ కమిటీ ఇచ్చిన సిఫారసుల మేరకు భారతదేశ న్యాయ వ్యవస్థలో కేంద్ర ప్రభుత్వం నూతన చట్టాలను తీసుకొచ్చింది. ఇండియన్ పీనల్ కోడ్ 1860 స్థానంలో భారతీయ న్యాయ సంహిత(బీఎన్ఎస్), సీఆర్‌పీసీ 1973 స్థానంలో భారతీయ నాగరిక్ సురక్ష సంహిత(బీఎన్ఎస్ఎస్), ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ 1872 స్థానంలో భారతీయ సాక్ష్య అధినియం(బీఎస్ఏ) చట్టాలుగా మారుతున్నాయి. నూతన చట్టాలపై భిన్న స్వరాలు వినిపిస్తున్నాయి. కొత్త చట్టాల అమలుకు పోలీసు యంత్రాంగం సన్నద్ధమైంది. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో పోలీసు సిబ్బంది శిక్షణ పూర్తి చేసుకున్నారు. కంప్యూటర్ వ్యవస్థలో అవసరమైన మార్పులు చేశారు.

అమల్లోకి కొత్త చట్టాలు

జూలై 1 నుంచి కొత్త క్రిమినల్ చట్టాలు అమలులోకి వచ్చాయి. నూతన చట్టంలో ఈ–ఎఫ్ఐఆర్, జీరో ఎఫ్ఐఆర్‌కు చోటు లభించింది. కొన్ని కేసుల్లో ఎఫ్ఐఆర్ లేకుండానే ప్రాథమిక విచారణ చేసే అవకాశం చట్టంలో కల్పించారు. ప్రాథమిక విచారణలో నేరం జరిగినట్టుగా రుజువైతే ఎఫ్ఐఆర్ నమోదు ఉంటుంది. నూతన చట్టాల ప్రకారం న్యాయమూర్తులు కేసులను రెండు వాయిదాలకు మించి ఎక్కువ రోజులు పొడిగించడానికి వీలుండదు. పోలీస్ శాఖకు పూర్తి అధికారాలు ఉండడంతో కేసు త్వరగా పూర్తవుతుంది. కొత్త చట్టం ద్వారా దర్యాప్తు అధికారులకు అధికారాలను ఎక్కువ కట్టబెట్టారని న్యాయవాదులు అభిప్రాయ పడుతుండగా, బాధితులకు భరోసా, భద్రత కలుగుతుందనేది పోలీసు అధికారుల అభిప్రాయంగా ఉంది.

చిన్న కేసులకు పెద్ద శిక్షలు

కొత్త చట్టాల ద్వారా దొంగతనం, గొలుసు చోరీ, చిన్న చిన్న కేసుల్లో సైతం అరెస్టయి జైలుకు వెళ్లాల్సి ఉంటుంది. ఫోన్లో దూషించినా, ఫొటోలు మార్ఫింగ్ చేసి ఇబ్బందులకు గురి చేసినా, కఠినమైన శిక్షలు పడతాయి. మహిళలపై జరిగే దాడులు, లైంగిక వేధింపులు, పోక్సో కేసుల్లో రెండు నెలల్లోపు పోలీసు దర్యాప్తులు పూర్తిచేసి చార్జ్‌షీటు వేయాల్సి ఉంది. కాలయాపన జరగకుండా ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ద్వారా నేరస్తులకు శిక్షపడి బాధితులకు భరోసా కలుగుతుంది. దర్యాప్తు సంస్థలైన సీబీఐ, ఈడీ, విజిలెన్స్, విభాగాలకు దర్యాప్తు అధికారాలు ఎక్కువగా ఉన్నాయి. జీరో ఎఫ్ఐఆర్ ద్వారా కాలయాపన జరగదు. బాధితులకు తక్షణ సాయం అందుతుంది. 15 ఏళ్లలోపు వారు, 60 ఏళ్లు పైబడిన వారు పోలీస్ స్టేషన్‌కు రాకుండా వారి నుంచి పోలీసు అధికారులు సాక్ష్యాధారాలు స్వీకరించాల్సి ఉంది. ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేసుకునే సౌకర్యం కల్పించినప్పటికి మూడు రోజుల్లోపు ఫిర్యాదుదారుడు స్టేషన్‌కు వచ్చి సంతకాలు చేయాల్సి ఉంటుంది. చిన్నపాటి నేరాల్లో నేరస్తుల్లో పరివర్తన తీసుకువచ్చే విధంగా కమ్యూనిటీ సర్వీస్ చేసేలా శిక్షలు ఉన్నాయి. బాధితులకు న్యాయం ఏ విధంగా జరుగుతుందనే విషయాన్ని కేసు నమోదైన 90రోజులు లోపు దర్యాప్తు అధికారులు చెప్పాల్సి ఉంది. ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్స్ ద్వారా బాధితుల స్టేట్‌మెంట్ రికార్డు చేసే అవకాశం ఉంది. ఈ–సాక్ష్యి, సంకలన్ వంటి యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంది. ఇప్పటికే జిల్లాలో పోలీసు అధికారులు ఈ యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకున్నారు.



బీఎన్ఎస్ సెక్షన్లుగా మారిన ఐపీసీ సెక్షన్లలో కొన్ని..

1. 302 IPC = 103 BNS	26. 354(D) IPC = 78 BNS
2. 304(A) IPC = 106 BNS	27. 363 IPC = 139 BNS
3. 304(B) IPC = 80 BNS	28. 376 IPC = 64 BNS
4. 306 IPC = 108 BNS	29. 284 IPC = 286 BNS
5. 307 IPC = 109 BNS	30. 286 IPC = 288 BNS (Fine - Rs.5000)
6. 309 IPC = 226 BNS	31. 290 IPC = 292 BNS (Fine - Rs.1000)
7. 286 IPC = 287 BNS	32. 294 IPC = 296 BNS
8. 294 IPC = 296 BNS	33. 447 IPC = 329 (3) BNS
9. 509 IPC = 79 BNS	34. 448 IPC = 329 (4) BNS
10. 323 IPC = 115 BNS	35. 392 IPC = 309 BNS
11. R/W 34 IPC = 3(5) BNS	36. 411 IPC = 317 BNS
12. R/W 149 = R/W 190 BNS	37. 420 IPC = 318 BNS
13. 324 IPC = 118(1) BNS	38. 382 IPC = 304 BNS
14. 325 IPC = 118(2) BNS	39. 442 IPC = 330 BNS
15. 326 IPC = 118(3) BNS	40. 445 IPC = 330 BNS
16. 353 IPC = 121 BNS	41. 447 IPC = 330 BNS
17. 336 IPC = 125 BNS	42. 448 IPC = 331 BNS
18. 337 IPC = 125 BNS(A)	43. 494 IPC = 82 BNS
19. 338 IPC = 125 BNS(B)	44. 498 (A) IPC = 85 BNS
20. 341 IPC = 126 BNS	45. 506 IPC = 351 BNS
21. 353 IPC = 132 BNS	46. 509 IPC = 79 BNS
22. 354 IPC = 74 BNS	47. 9(I), 9(II) = 112 BNS
23. 354(A) IPC = 75 BNS	
24. 354(B) IPC = 76 BNS	
25. 354(C) IPC = 77 BNS	

సిబ్బందికి అవగాహన కల్పించాం



కొత్త చట్టంపై సిబ్బందికి అవగాహన కల్పించాం. చట్టంలో వచ్చిన మౌలిక మార్పులు, ముఖ్యమైన అంశాలపై జిల్లాలో 25 పోలీస్‌స్టేషన్ల పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న వేయిమంది వరకు సిబ్బందికి అవగాహన కల్పించాం.

– ఎస్. శ్రీధర్, జిల్లా పోలీస్ సూపరింటెండెంట్, అమలాపురం

పారదర్శకతకు అవకాశం



నూతన చట్టాల ద్వారా దర్యాప్తు సంస్థలకు అధికారాలు అధికంగా ఉన్నాయి. వివిధ కేసుల్లో బాధితులకు నేరుగా న్యాయం జరుగుతుంది. ఏ చిన్న కేసులోనూ నేరస్తులు తప్పించుకోకుండా శిక్ష అనుభవిస్తారు. పారదర్శకతకు అవకాశం ఉంటుంది.

– బి.రామకృష్ణ, డీఎస్పీ రామచంద్రపురం

పోలీసు శాఖకు ఎక్కువ అధికారాలు



నూతన క్రిమినల్ చట్టాలలో పోలీసు శాఖకు ఎక్కువ అధికారాలు కేటాయించారు. మేజిస్ట్రేట్ అధికారాలు తక్కువ ఉన్నాయి. ఆర్టికల్ 21 దుర్వినియోగం అయ్యే ప్రమాదం ఉంది. పాత, కొత్త కేసులను పరిష్కరించడంలో న్యాయ వ్యవస్థలో గందరగోళం ఏర్పడే ప్రమాదం ఉంది.

– పిల్లి మురళీమోహన్ వెంకటరమణ, అధ్యక్షుడు, బార్ అసోసియేషన్, రామచంద్రపురం.

రూ.100 నాణెం సేకరణ



రవి సుబ్రహ్మణ్యం సేకరించిన నాణెం

అమలాపురం టౌన్: భారతీయ స్టేట్‌బ్యాంక్ (ఎస్‌బీఐ) 2006 సంవత్సరానికి 200 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కోల్‌కతా టంకశాల రూ.100, రూ.5 స్మారక నాణేలను విడుదల చేసింది.

ఈ రెండు నాణేలను అప్పట్లోనే సేకరించిన అమలాపురానికి చెందిన ఎస్‌బీఐ ఉద్యోగి, నాణేల సేకరణ కర్త ఇవటూరి రవి సుబ్రహ్మణ్యం ఎస్‌బీఐ డే సందర్భంగా తాను పనిచేస్తున్న బ్యాంక్‌లో సోమవారం ప్రదర్శించారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

రాయవరం: ఏపీ సార్వత్రిక విద్యా పీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన పదవ తరగతి, ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు సోమవారం రాత్రి విడుదలయ్యాయి. పదవ తరగతి ఫలితాల్లో తూర్పుగోదావరి జిల్లా 97.28 శాతంతో రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలువగా, ఇంటర్ ఫలితాల్లో 88.95శాతంతో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. పదవ తరగతి ఫలితాల్లో తూర్పుగోదావరి జిల్లా నుంచి 515 మంది హాజరు కాగా 501 మంది ఉత్తీర్ణత సాధించారు. కాకినాడ జిల్లా నుంచి 827 మంది పరీక్షకు హాజరు కాగా, 774 మంది ఉత్తీర్ణత(93.59శాతం) సాధించారు. కోనసీమ జిల్లా నుంచి 267 మంది హాజరు కాగా 216 మంది ఉత్తీర్ణత(80.90శాతం) సాధించారు. ఓపెన్ ఇంటర్‌కు కోనసీమ జిల్లా నుంచి 1,385 మంది పరీక్షకు హాజరు కాగా 1,232 మంది ఉత్తీర్ణత సాధించారు. కాకినాడ జిల్లా నుంచి 1,457 మంది పరీక్షకు హాజరు కాగా, 1,268 మంది ఉత్తీర్ణత(87.03శాతం) సాధించగా, తూర్పుగోదావరి జిల్లా నుంచి 1,105 మంది పరీక్షకు హాజరు కాగా, 942 మంది ఉత్తీర్ణత(85.25) శాతం మంది ఉత్తీర్ణత సాధించారు.

మళ్లీ అదే సెల్‌ఫోన్ షాపులో చోరీ

కడియం: మండల కేంద్రమైన కడియంలోని హైస్కూలు ఎదురుగా గల ఉండమట్ల ప్రభాకర్‌కు చెందిన సెల్‌ఫోన్ షాపు తాళాలు పగులగొట్టి దొంగలు చోరీకి పాల్పడ్డారు. కొత్త సెల్‌ఫోన్లు 10, రిపేరుకు ఇచ్చినవి 5 ఫోన్లు ఈ చోరీలో దొంగలెత్తుకుపోయారని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో బాధితుడు పేర్కొన్నారు. డీఎస్పీ అంబికాప్రసాద్, కడియం పోలీస్ ఇన్‌స్పెక్టర్ బి.తులసీధర్ తమ సిబ్బందితో వచ్చి పరిశీలించారు. క్లూస్ టీం వివరాలు సేకరించారు. కాగా ఇదే షాపులో గతంలో కూడా రెండుసార్లు చోరీ జరిగింది. అప్పుడు సైతం లక్షలాది రూపాయల విలువైన ఫోన్లు మాయమయ్యాయి. ఒకే షాపులో ఇప్పటి వరకు మూడు సార్లు చోరీలు జరగడం పై గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారిపైనే ఉన్న షాపు తాళాలు పగలుగొట్టి మరీ చోరీలు చేయడంపై ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

గురుకులాల్లో మిగిలిన సీట్లకు స్పాట్ అడ్మిషన్లు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 5వ తరగతిలో మిగిలి ఉన్న ఖాళీలను భర్తీ చేయనున్నారు. ఈ నెల 4న ఉదయం 10 గంటలకు కాకినాడ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో లాటరీ పద్ధతి ద్వారా ఖాళీ సీట్లను భర్తీ చేస్తామని జిల్లా సమన్వయ కర్త జి.వెంకటరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఏ పాఠశాలను అయితే కోరుకుంటారో ఆ పాఠశాలకు వెళ్లి దరకాస్తు చేసుకోవాలన్నారు. ఇంతకుముందు పాఠశాలలో దరఖాస్తు ఇచ్చినవారు, దరఖాస్తు చేయనివారు హాజరుకావచ్చునన్నారు. ఇ కేటగిరి విద్యార్థులు మాత్రమే అర్హులన్నారు.

రెండు చిట్‌ఫండ్ కంపెనీలపై పోలీసులకు ఫిర్యాదు

కాకినాడ లీగల్: చీటీ పాడుకున్న వారికి సొమ్ము చెల్లించకపోవడంతో రెండు చిట్‌ఫండ్ కంపెనీలపై జిల్లా కలెక్టర్‌తోపాటు కాకినాడ జిల్లా రిజిస్ట్రార్‌కు అనేకమంది బాధితులు ఫిర్యాదు చేశారు. దీనిపై కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశాల మేరకు పిఠాపురానికి చెందిన శ్రీసత్య శివాని చిట్‌ఫండ్స్ ప్రైవేటు లిమిటెడ్, కాకినాడకు చెందిన శ్రీ వినాయక ఈస్ట్ చిట్‌ఫండ్స్ ప్రైవేటు లిమిటెడ్ యజమానులపై రిజిస్ట్రేషన్ శాఖలో చిట్స్ విభాగం అధికారి (రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్) ఎం.సుధారాణి పోలీసులకు ఫిర్యా దు చేశారు. శ్రీసత్య శివాని చిట్‌ఫండ్స్ ప్రైవేటు లిమిటెడ్ ఎండీ అండ్ ఫోర్‌మెన్ కె.సత్యనారాయణ, అదే కంపెనీకి చెందిన డైరెక్టర్స్ పి.వరహాలరావు, ఎల్.భాస్కరరావుపై పిఠాపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. శ్రీ వినాయక ఈస్ట్ చిట్‌ఫండ్స్ ప్రైవేటు లిమిటెడ్ ఎండీ అండ్ ఫోర్‌మెన్ పీసుపాట శేతుమాధవరావుపై కాకినాడ టూ టౌన్ పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేయగా ఫిర్యాదు తీసుకోలేదు. దీంతో టూటౌన్ పోలీసులకు రిజిస్టర్ పోస్ట్ ద్వారా ఫిర్యాదు పంపినట్టు రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్ ఎం.సుధారాణి తెలిపారు.

మహిళ అదృశ్యం

అమలాపురం రూరల్: బండారులంక పేరివారి కాలనీకి చెందిన కొండా నాగ లక్ష్మి పార్వతి (35)అదృశ్యంపై అమలాపురం తాలూకా పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై వై.శేఖర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం గతనెల 28 నుంచి తన భార్య నాగలక్ష్మిపార్వతి కనిపించడం లేదని భర్త సూర్యారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఫ్లెక్సీలు చించివేతపై కేసు నమోదు

కామనగరువు బీవీ రమణయ్య కాలనీలో ఆదివారం రాత్రి ఫ్లెక్సీలు గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న నాయకులు అక్కడికి చేరుకుని ఫ్లెక్సీల వివాదాన్ని పోలీసులకు తెలిపారు. సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వై. శేఖర్‌బాబు తెలిపారు.

గాంధీ విగ్రహం పక్కన అక్రమ నిర్మాణం ఆపాలని ధర్నా


అమలాపురం రూరల్: అమలాపురం మండలం జనుపల్లి పెద్ద వీధిలోని గాంధీ సెంటర్‌లో 79 సంవత్సరాల క్రితం మహాత్మాగాంధీ విగ్రహం పక్కనే విజయదుర్గ అమ్మవారి ఆలయం నిర్మించారు. పంచాయతీకి చెందిన స్థలంలో ఇటీవల గాంధీ విగ్రహం పక్కనే బేస్‌మెంట్ తొలగించి అక్రమంగా నిర్మాణం చేపట్టారని ఆర్యవైశ్య సంఘం నాయకులు కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా చేశారు. అనంతరం ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో కలెక్టర్ శుక్లాకు ఫిర్యాదు చేశారు. జనపల్లి మెయిన్‌రోడ్డులో 1955లో రైతు తటవర్తి సుర్యనారాయణమూర్తి ఈ విగ్రహాన్ని నిర్మించి 15 సంవత్సరాల క్రితం విగ్రహం పక్కనే విజయదుర్గ ఆలయం నిర్మించారు. ప్రస్తుతం విజయదుర్గ ఆలయ కమిటీ అక్రమంగా నిర్మాణం చేపట్టింది. దీనిపై సర్పంచ్, ఎంపీటీసీ సభ్యుడు, గ్రామ పెద్దలకు తెలియజేసినా పట్టించుకోకుండా నిర్మిస్తున్నారని ఆర్యవైశ్య సంఘం నాయకులు తటవర్తి మల్లికార్జునరావు, టి.సత్యనారాయణ మూర్తి తదితరులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

సౌర విద్యుత్ ఇలా పొందాలి..

- అందుబాటులోకి ప్రధాన మంత్రి సూర్య ఘర్ సోలార్
- గృహ విద్యుత్ వినియోగదారులకు ప్రయోజనం
- రూ.2.20 లక్షలతో యూనిట్
- రూ.78 వేల కేంద్ర సబ్సిడీ
- సులభ వాయిదాలతో బ్యాంకు రుణం

మలికిపురం: కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రధాన మంత్రి సూర్యఘర్ సోలార్ స్కీమ్ వినియోగదారులకు అందుబాటులోకి వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వ విద్యుత్ శాఖ ద్వారా ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. ఏపీఈపీడీసీఎల్ ఆధ్వర్యంలో గృహ వినియోగదారులకు ఈ యూనిట్లను అందిస్తున్నారు. దీనికోసం ఆంధ్ర ప్రదేశ్ విద్యుత్ పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏజెన్సీని నెలకొల్పి యూనిట్ పరికరాలను వినియోగదారులకు అందిస్తున్నారు. వినియోగదారులు ఈ పథకంలో యూనిట్ నెలకొల్పుకోదలచుకుంటే ఆయా మండల కేంద్రాలలోని విద్యుత్‌శాఖ ఏఈలను సంప్రదించాలి. తమ అధీనంలో ఏజెన్సీ ద్వారా బ్యాంకు రుణాలతో యూనిట్ పరికరాలను వినియోగదారులకు అందిస్తారు. యూనిట్ మొత్తం ఖర్చు రూ.2.20 లక్షలు అవుతుండగా ఇందులో లబ్ధిదారుడు రూ.20 వేలు మాత్రమే జయ చేయాల్సి ఉంది. రూ.78 వేలు కేంద్రం సబ్సిడీగా అందిస్తుండగా మిగిలిన మొత్తం సులభ వాయిదాల పద్ధతిలో ఎటువంటి సెక్యూరిటీ పత్రాలు లేకుండా బ్యాంకులు రుణంగా అందిస్తున్నాయి.

లబ్ధిదారులు తమ నివాసాలపై సోలార్ యూనిట్‌ను అమర్చుకుంటే దాని నుంచి ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను స్థానిక మండల కేంద్రాల విద్యుత్ అధికారులు ఏర్పాటు చేసిన ప్రత్యేక మీటరు ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది. సోలార్ సిస్టం ద్వారా ఉత్పతి అయిన విద్యుత్‌ను లబ్ధిదారులు నేరుగా వాడుకోవడం కుదరదు. దీనిని ప్రభుత్వమే కొనుగోలు చేసి ఇప్పటికే ప్రభుత్వం ఇచ్చిన సర్వీసు ద్వారా లబ్ధిదారులు వాడుకున్న విద్యుత్ బిల్లు నగదు మినహాయించుకుని లబ్ధిదారులు ఉత్పత్తి చేసిన విద్యుత్‌కు ప్రభుత్వం నగదు చెల్లిస్తుంది. ఈ విధానంలో వినియోగదారులు తాను ఉత్పత్తి చేసిన విద్యుత్ కంటే అదనంగా వాడుకుంటే బిల్లు చెల్లించాల్సి ఉంటుంది. దీనికోసం ఆయా లబ్ధిదారుల ఇంటికి ప్రత్యేకంగా వేరే విద్యుత్ లైన్ వేయనవసరం లేదు. ఉన్న లైన్ల ద్వారానే సేవలను అందిస్తారు.



సోలార్ యూనిట్

సద్వినియోగం చేసుకోండి



ఏపీఈపీడీసీఎల్ ద్వారా మలికిపురం కేంద్రంగా యూనిట్ పరికరాలను అందిస్తున్నాం. 300 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తికి 3 కేవీ సామర్థ్యం గల సోలార్ యూనిట్ ఏర్పాటు చేసుకోవచ్చు.

– దొడ్డా నాగబాబు, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా డైరెక్టర్, మలికిపురం

ఏజెన్సీ ద్వారా యూనిట్లు



ప్రధానమంత్రి సోలార్ విద్యుత్ పథకంలో యూనిట్లను ఏర్పాటు చేసుకునే లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోండి. ఏర్పాటు చేసిన ఏజెన్సీ ద్వారా యూనిట్లను అందిస్తున్నాం.

– మద్దూరి సతీష్, విద్యుత్ శాఖ ఏఈ, మలికిపురం

సాక్షి ఉద్యోగ అవకాశాలు
ప్రతి మంగళ, శుక్రవారములలో

J.SIKILE SCHOOL
SENIOR SECONDARY SCHOOL, AFFILIATED TO C.B.S.E.
NARSAPUR-534 275, West Godavari Dist., A.P.
Email : edu@jsikile.in www.jsikile.in
STAFF VACANCIES FOR THE ACADEMIC YEAR 2024-25
• PGT - PHYSICS / ACCOUNTANCY BUSINESS STUDIES / ECONOMICS
• PRIMARY - HINDI / KINDERGARTEN TEACHERS
• TGT - SOCIAL • PET
• Apply in person with original Certificates on 03.07.2024, WEDNESDAY to 05.07.2024, FRIDAY between 10:00 A.M. and 5:00 P.M. at the School Campus.
• One way second class train/bus fare in the shortest route will be reimbursed.
WE ARE LOOKING FOR COMMITTED TEACHERS WHO ARE GOOD AT COMMUNICATION SKILLS
Tel : (08814) 273287 / (O) 99084 36817 CORRESPONDENT
AN ISO 9001 : 2015 CERTIFIED INSTITUTION

సాక్షి క్లాసిఫైడ్స్

Services

GOLD FINANCE

■ బంగారం బ్యాంగిల్స్‌/ ఏ ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్నటువంటి బంగారం రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% క్యాష్) ✆ 91699 22299

Wanted

■ Wanted Teachers : Hihg School English (02) and P.E.T (02) Part time or full time. Cont Imdly: GTLC EM School, Rajahmundry. ✆ : 85007 37977, 98497 02543 [R-6785]

■ వైద్యశాల వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్ లో పని చేయుటకు లేడీ సూపర్ వైజర్స్, నర్సులు, కాంపౌండర్స్, ఆయాలు, భార్యాభర్తలు కావలెను. 9391036931, 9246585901 [HA-13695]

■ ఏజెన్సీలు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. జీతం : 12,000 + రూం. కాకినాడ కన్స్ట్రక్షన్ సైట్‌లో. Ph: 9492883231 [HA-13696]

■ హైదరాబాద్ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులు, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి-భోజనం. జీ : 18K సంప్ర : 9640258899, 9640468899 [H-796175]

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు. 95026 15217 [M-1185232]

■ రాజమండ్రి క్రైస్తవ బాలికల హాస్టల్‌లో స్త్రీ వార్డెన్స్ కావలెను. Q: Inter/Degree జీతం 10000/- ఫ్రీ రూమ్ + ఫుడ్, లేడీ కంప్యూటర్ ఆపరేటర్ కావలెను. H.No.107 మున్సిపల్ కాలనీ, ✆ : 89195 49175 [R-6787]

■ హోండా టూ వీలర్స్ సర్వీస్ గురించి Explain చేసే B.Tech., అభ్యర్థులు కావలెను. జీతము 15000/- నుండి 20,000/- వరకు Cont: శ్రీదేవి హోండా టూ వీలర్స్, టూ టౌన్ పోలీస్ స్టేషన్ దగ్గర, మెయిన్ రోడ్, కాకినాడ. ✆ : 94909 98888 [R-35]

■ శ్రీ NRKA టెక్స్‌టైల్స్ రాజమండ్రిలో పని చేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. డ్యూటీ 8 గం॥ జీతం: 7500 నుండి 12000 వరకు & PF, ESI, ఉచిత వసతి, సబ్సిడి భోజనం ఏర్పాటు సంప్ర॥ లాలాచెర్వు జంక్షన్. ✆ : 85009 91230 [R - 532]

■ టీమ్ లీడర్స్, ఎగ్జిక్యూటివ్స్ బ్యాంక్ అనుబంధ సంస్థలో కావలెను. Sal+Inc. 40 వేలు, వ: 30-70 yrs Q: 10th+ రిటైర్డ్, వ్యాపారస్తులు, RMP డాక్టర్స్, గృహిణులు, ఇన్సూరెన్స్ ఏజెంట్స్‌కు, మార్కెటింగ్‌కు ప్రాధాన్యత. ✆ 99666 34511 సాయంత్రం 5 టు 10 గం॥ మాత్రమే ఫోన్ చేయగలరు. [B-139]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

SHRIRAM Finance **శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్**
నమోదిత కార్యాలయం : శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032.
ఆఫీస్ చిరునామా : డి.నెం.6-12-5/1, 2వ అంతస్తు, కొరుగంటివారి వీధి, ఇన్నీస్‌పేట, కోటిపల్లి బస్టాండ్ ఎదురుగా, రాజమహేంద్రవరం-533101.
స్వాధీనత ప్రకటన
మెస్సర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో 'శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్' గా పిలువబడేది) ... [illegible]
రుణగ్రహీత మరియు గ్యారంటర్ల పేరు మరియు చిరునామా	డిమాండ్ నోటీసు ప్రకారం మొత్తము బకాయి	అన్యాక్రాంతం స్వాధీనపరచుకొనిన తేది
[illegible]	లోన్ అకౌంట్ నెంబరు : RAZOLTF1903200006 కు రూ.16,62,160/- ... [illegible]	27.06.2024
[illegible]
తేది : 27.06.2024, స్థలం : రాజమండ్రి సం/- అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

SHRIRAM Finance **శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్**
నమోదిత కార్యాలయం : శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032.
ఆఫీస్ చిరునామా : డి.నెం.6-12-5/1, 2వ అంతస్తు, కొరుగంటివారి వీధి, ఇన్నీస్‌పేట, కోటిపల్లి బస్టాండ్ ఎదురుగా, రాజమహేంద్రవరం-533101.
స్వాధీనత ప్రకటన
[illegible]
రుణగ్రహీత మరియు గ్యారంటర్ల పేరు మరియు చిరునామా	డిమాండ్ నోటీసు ప్రకారం మొత్తము బకాయి	అన్యాక్రాంతం స్వాధీనపరచుకొనిన తేది
[illegible]	లోన్ అకౌంట్ నెంబరు : RAZOLTF1903270006 కు రూ.14,33,667/- ... [illegible]	27.06.2024
[illegible]
తేది : 27.06.2024, స్థలం : రాజమండ్రి సం/- అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్